క్లుప్తంగా

ఫ్యామిలీ ఫిజీషియన్ పక్కాగా నిర్వహించాలి



గార్గేయపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆదేశించారు. ఆయన బుధవారం గార్గేయపురం పీహెచ్‌సీని సందర్శించి వ్యాధినిరోధక టీకాల కార్య క్రమాన్ని పరిశీలించారు. అక్కడి రికార్డులు, రిపోర్టులు తనిఖీ చేశారు. అన్ని యాప్‌లలో జాతీయ ప్రోగ్రామ్‌లను వంద శాతం అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం పసుపుల గ్రామ సచివాలయంను సందర్శించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి, మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. అక్కడికి వచ్చిన రోగులందరికీ రక్తపరీక్షలు చేయాలని, మధ్యాహ్నం నుంచి ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులను పర్యవేక్షించి మందులు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తం చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

పదోన్నతుల కల్పనకు అంగీకారం

కర్నూలు(అగ్రికల్చర్): పట్టు పరిశ్రమ శాఖలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీధర్ సంసిద్ధత వ్యక్తం చేశారని జిల్లా పట్టు పరిశ్రమ ఉద్యోగుల సంఘం నేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక విజయకుమార్ తెలిపారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఉద్యోగుల సంఘం తరఫున కమిషనర్ శ్రీధర్‌ను కలిసి పదోన్నతులపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇటీవల సెరికల్చర్ అధికారులకు ఏడీలుగా పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఎస్‌ఓ, ఏఎస్‌ఓ, టీఓ పదోన్నతులు చేపట్టాలని కోరారు. పట్టు పరిశ్రమ సీడ్‌ఫామ్, చాకీ సెంటర్లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని,వాటిలో ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కమీషనర్ శ్రీధర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. త్వరలోనే పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

21న ఉద్యోగ మేళా

కర్నూలు(సెంట్రల్): నవభారత్ అగ్రో ఏజెన్సీ కంపెనీలో పలు ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 21వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.దీప్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాకు డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు మహిళలు, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారుడు ఆకాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కే.బి.జ్యోతి

కర్నూలు(రూరల్): ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీలలో నగరంలోని అథెనా పాఠశాలకు చెందిన టి.ఆకాష్ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ కే.బి. జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పతకం సాధించిన ఆకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అక్టోబర్‌లో చండీగఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆకాష్ ఎంపికైనట్లు తెలిపారు.

22న గోదాదేవి జయంతి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో ఈనెల 22వ తేదీన గోదాదేవి జయంతి పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీరంగధామం పారాయణ బృందం అధ్యక్షుడు బిలకంటి మురళీధర్ బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీ గోదా అమ్మవారికి పంచామృతాభిషేకం,తిరుప్పావై పారాయణం, ప్రవచనం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బ్రిక్స్ పొలిటికల్ డెలిగేషన్‌లో ప్రసంగం

కర్నూలు కల్చరల్: దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన బ్రిక్స్ సమ్మిట్‌లో జిల్లాకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వినూషారెడ్డి పాల్గొన్నారు. సౌత్‌ఆఫ్రికాలోని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన బ్రిక్స్ పొలిటికల్ పార్టీస్ ప్లస్ డైలాగ్ డెలిగేషన్‌లో పాల్గొన్న ఈమె వైద్యంతో పాటు మానవ వనరుల అభివృద్ధి, పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశంపై ప్రసంగించారు. ఆఫ్రికాతో భారత దేశ సంబధాల ప్రాముఖ్యత, దేశంలో ప్రధాని నరేంద్రమోదీ తీసుకొచ్చిన చారిత్రక మార్పులపై సమ్మిట్‌లో మాట్లాడారు.

ఆరోగ్య ఫలం 'జామ'

- పేదవాడి ఆపిల్‌గా గుర్తింపు
- రోజూ ఒక కాయ తింటే ఆరోగ్యానికి ఢోకా లేనట్లే
- మార్కెట్‌లో కళకళలాడుతున్న జామ



విక్రయానికి ఉంచిన జామ పండ్లు

కర్నూలు (న్యూసిటీ): మార్కెట్‌లో ప్రతిరోజూ ఉదయమే తాజా జామకాయలు నిగనిగలాడుతూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. సామాన్యులు మొదలుకొని సంపన్నుల వరకు జామను ప్రతిఒక్కరూ ఆప్యాయంగా తింటారు. సామాన్య మధ్య తరగతి కుటుంబానికి పసందైన పండు జామ. ప్రస్తుతం మార్కెట్‌లో నాటు రకాలకు చెందిన జామ లభిస్తుండడంతో వినియోగదారులు పోటీ పడి కొంటున్నారు. మార్కెట్‌లో కేజీ రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. జిల్లాలో రైతులు 950 ఎకరాల్లో జామ తోటలను సాగు చేస్తున్నారు. ఏడాదికి 2 లేదా 3 పంటలు వస్తాయి. 5 నుంచి 6 టన్నులు దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ.15 వేల వరకు ఉంటుంది. హైబ్రిడ్ రకాలతో పోలిస్తే నాటు జామలో పోషకాలు ఎక్కువగా ఉండడం వినియోగాదారులను ఆకర్షిస్తోంది.

జామ పండుతో అనేక వ్యాధులు దూరమవుతాయి. రోజూ తినడం ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించి, ప్రొటీన్‌ను పెంచుతుంది. జామలో కొవ్వు, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి పండు. జమకాయలో పోషకాలు, విటమిన్లు. పీచు పదార్థం వంటి గుణాల వల్ల చక్కెర వ్యాధిగ్రస్తులు సైతం తినవచ్చు. జామ పండులో 21 శాతం విటమిన్ ఏ ఉంటుంది. ఇది చర్మాన్ని ప్రకాశవంతం, శ్లేష పొరలను నివారించడానికి సహాయపడుతుంది. ఈ పండులో 20 శాతం ఫోలేట్ ఉండడంతో స్త్రీల నెలసరి సమస్యల పరిష్కారానికి బాగా పని చేస్తోంది. పింక్ కలర్ జామపండులో ఉండే లైకోపీన్ అతినీల లోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది. జామలో పొటాషియం ఎక్కువగా ఉండడంతో రక్తపోటును నివారిస్తుంది. నారింజ పండు కంటే జామలో విటమిన్ సి ఎక్కువ ఉంటుంది. అలాగే టమాటలో ఉన్నట్టే జామ పండులోనూ లైకోపిన్ పోషకం ఉంటుంది. కాస్త మగ్గిన జామ పండులో పీచు ఎక్కువగా ఉండడంతో మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఒక జామ పండు 10 యాపిల్స్‌కు సమానమని ఆహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్లనే జామను పేదవాడి యాపిల్‌గా వ్యవహరిస్తారు. రోజు ఒక జామ కాయ తింటే ఆరోగ్యంగా ఉన్నట్లే. ఇటీవల కాలంలో రైతులు హైబ్రిడ్ జామలో రాణిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాటు రకానికి చెందిన జామ కాయలు లభిస్తున్నాయి. కాయలు చిన్నవిగా ఉన్నప్పటికీ మంచి రుచి ఉండడంతో అన్ని వర్గాల ప్రజలు ఇష్టంగా తింటారు.

జామ ఆకులతో ప్రయోజనాలు

జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలకు జామ ఆకులు బాగా పనిచేస్తాయి. అతిసారం, నరాల బహీనతలను నివారిస్తుంది. జామ ఆకులను వేడి నీటిలో ఉడకబెట్టి టీ తయారు చేసుకొని తాగవచ్చు. జామ ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాల వల్ల జుట్టు రాలడం ఆగిపోయి వెంట్రుకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది.

సీజన్‌లో తప్పనిసరిగా కొంటాం



జామ పండ్లను ప్రతి సీజన్‌లో తప్పనిసరిగా కొనుగోలు చేస్తాం. జామ పండ్లను తినడం ద్వారా దంతాల సంరక్షణతో పాటు చిగుళ్ల నుంచి రక్తస్రావాన్ని నివారిస్తుంది. రోజు ఒక జామ కాయ తింటే ఆరోగ్యంగా ఉంటాం. నాటు జామ కాయలు చిన్నవిగా ఉన్నా మంచి రుచి ఉంటుంది.మా ఇంట్లో పిల్లలు బాగా తింటారు.

– బాలు ఈశ్వర్ (కొనుగోలుదారుడు)

షుగర్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచిది

సీజన్‌లో లభించే జామ పండు రోజూ ఒకటి చొప్పున తీసుకుంటే షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. దోర జామ పండులోని వగరు దంతాలను శుభ్రం చేయడంతో పాటు చిగుళ్ల నుంచి రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఈ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉండడంతో కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది.జామ ఆకులను ఎండబెట్టి పొడిచేసి పాలు, నీళ్లల్లో కలుపుకొని తాగితే అతిసారం, నరాల బహీనతలను నివారిస్తుంది.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి (ఆయుర్వేదం)

స్వర్ణకారులకు అవగాహన



స్వర్ణకారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: రసాయనాల (యాసిడ్) వినియోగంలో జాగ్రత్తలపై స్వర్ణకారులకు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు, బంగారం కరిగించే వారిని సమావేశానికి రప్పించి రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించారు. గోల్డ్ స్మిత్ అసోసియేషన్ సభ్యులు, గోల్డ్ కరిగించే అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. అధిక మొత్తంలో రసాయనాలను భద్రపరచుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి డీఎస్పీ వారికి వివరించారు. రసాయనాలు కలిగి ఉండడం, విక్రయించడం, కొనడం తదితర వాటికి సంబంధించి నియమ నిబంధనలను వివరిస్తూ లైసెన్స్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. తగిన అనుమతి లేకుండా ఎవరూ రసాయనాలను వినియోగించరాదని ఆదేశించారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండవ పట్టణ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎంసీఏ ఆస్తులపై తప్పడు ప్రచారం తగదు

- వైఎంసీఏ ప్రాజెక్టు ఛైర్మన్ బిషప్ ఏజేసీ శోభన్‌బాబు వెల్లడి



మాట్లాడుతున్న వైఎంసీఏ ప్రాజెక్టు ఛైర్మన్ ఏజేసీ శోభన్‌బాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని రాజ్ థియేటర్ సమీపంలో ఉన్న వైఎంసీఏ (యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్) ఆస్తులపై ఎవరికీ హక్కులు లేవని, ఈ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయంటూ బోగస్ ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైఎంసీఏ ప్రాజెక్టు ఛైర్మన్ ఏజేసీ శోభన్ బాబు హెచ్చరించారు. గురువారం స్థానిక వైఎంసీఏ కర్నూలు ప్రోగ్రాం సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ.. నగరంలో వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌కు చెందిన ఈ ఆస్తిని లీజుకు లేదా కమర్షియల్ కార్యక్రమాలకు, అమ్మకానికి పెట్టినట్లు, కొనుగోలు చేసినట్లు వస్తున్న వార్తలు నమ్మవద్దన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 1960 నుంచి ఈ ప్రాజెక్టు కర్నూలులో ఎన్నో సేవా కార్యక్రమాలు, దైవ సంబంధ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇటీవల ఈ స్థలాన్ని కార్పొరేట్ సంస్థలకు ఇచ్చారంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అందులో వాస్తవం లేదన్నారు. ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో బిషప్ వి.ధన్‌రాజ్, న్యాయవాదులు చిన్నయ్య, జి.రవికుమార్, ఎన్‌జీఓ బాలస్వామి, శ్యామ్‌కుమార్, చక్రవర్తి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి



కొంగనపాడు గ్రామంలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొంగనపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి, డీటీ గిరికుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కేశవరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉలిందకొండ గ్రామంలో నాయకులు రమణారెడ్డి, రమణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. గ్రా మంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. సర్పంచ్ సుంకులమ్మ, గ్రామ నాయకులు శ్రీనివాసులు, శీనయ్య, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వచ్చింది. మా నాన్న రామిరెడ్డి మరణించి నెల రోజులైంది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉచితంగా అందిస్తారని చెప్పి వలంటీర్ దరఖాస్తు చేయించాడు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా వెంటనే సర్టిఫికెట్ వచ్చింది. గ్రామ సచివాలయం దగ్గరకే అధికారులు వచ్చి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించడం గొప్ప విషయం. **– మహేశ్వర్‌రెడ్డి, కొంగనపాడు**

ఇక నుంచి పథకాలు వర్తిస్తాయి



నేను రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాను. గతంలో పంట నష్ట పోయినప్పుడు పరిహారం అందక చాలా ఇబ్బందులు పడ్డాను. కౌలు కార్డు ఉంటే ప్రభుత్వం అందించే రైతు భరోసా, పంట నష్ట పరిహారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు వంటివి అందుతాయని అధికారులు తెలిపారు. సురక్ష కార్యక్రమం ద్వారా కౌలు హక్కు పత్రం పొందాను. ఇకపై యాజమాన్య రైతులతో సమానంగా పథకాలు అందుకుంటాను. **– టి.మధు, కొంగనపాడు.**

నిర్లక్ష్యపు ఉద్యోగులపై చర్యలు తీసుకోండి

కర్నూలు (సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించే ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పంచాయతీరాజ్ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. బుధవారం ఆమె తన కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, జగనన్న సురక్ష, విద్యాశాఖ పథకాలపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు మండలాల వారీగా రోజువారీ లక్ష్యాలను సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని పంచాయతీ రాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ఇప్పటివరకు 2.98 లక్షల టోకన్లు ఇచ్చామని, అందులో 2.76 లక్షల సర్వీసులను ప్రజలకు అందజేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న 22 వేల సర్వీస్ రిక్వెస్టులను క్యాంపులు నిర్వహించి ఆగస్టు 1వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులను చూపించాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డిని ఆదేశించారు. బడిబయటి పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్‌ను ఆదేశించారు.

అద్దె వసూళ్లపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న వివిధ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల అద్దెలను సకాలంలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆమె ఛాంబర్‌లో ఎస్సీ కార్పొరేషన్ కో–ఆపరేటివ్ షాపింగ్ కాంప్లెక్స్ సొసైటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా విడిపోయిన తర్వాత ఆదోని, ఆలూరు, గూడూరు, కోడుమూరు, కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరులలో ఉన్న 72 ఎస్సీ కార్పొరేషన్ దుకాణాల అద్దె వసూలు మందకొడిగా సాగుతుందన్నారు. బకాయిలు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని దుకాణాల కిరాయిదారులు చనిపోవడంతో అద్దె వసూలు కావడం లేదన్నారు. ఈ క్రమంలో అద్దె చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలని సొసైటీలను ఆదేశించారు. కొన్ని షాపులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. అద్దెను చెల్లించని వారిని తొలగించి వారి స్థానంలో నిబంధనల ప్రకారం కొత్తవారికి షాపులను కేటాయించాలని ఆదేశించారు. సమావేశంలో మెంబర్ కన్వీనర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, డీఆర్‌డీఏ పీడీ శివలీల పాల్గొన్నారు.

23న క్యారమ్స్ ఎంపిక పోటీలు

కర్నూలు(రూరల్): ఈ నెల 23వ తేదీన నగరంలోని యునైటెడ్ క్లబ్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి చెన్న కేశవరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 29, 30 తేదీల్లో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 92474 00100 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మహా పాదయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (రూరల్): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధి కొరకు ఈ నెల 26వ తేదీన ఆదోని నుంచి ప్రారంభమయ్యే మహా పాదయాత్రకు కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ హాజరవుతారన్నారు. 31వ తేదీన కలెక్టరెట్ ఎదుట జరిగే ధర్నాకు పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జిల్లాల విభజన తర్వాత కర్నూలు ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా జీవనాడి అయిన గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువ, వేదవతిని వెంటనే పూర్తి చేయాలన్నారు. హంద్రీ నీవా కాలువను వెడల్పు చేసి జిల్లాలోని చెరువులను నీటితో నింపాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో 50 పడకలతో ఆసుపత్రులను నిర్మించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమలు లేక ఉపాధి కోసం హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. పత్తికొండలో టమాట జ్యూస్, సాస్, ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనిదినాలను 200 రోజులకు పెంచి రూ.600 దినసరి కూలీ ఇవ్వాలని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు మాట్లాడుతూ.. మహిళలపై అత్యాచారాలు, దాడులను అరికట్టాలన్నారు. రాష్ట్రంలోని మద్యం దుకాణాలను తొలగించాలన్నారు. అనంతరం మహా పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. సీపీఎం నాయకులు రాజశేఖర్, రాముడు, గురు శేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, హుస్సేన్ భాష పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి



అధికారులతో సమీక్షిస్తున్న డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో గుర్తించిన బడి ఈడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి అమరనాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిద శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి బడి ఈడు పిల్లలు ఎంత మందిని గుర్తించారు? వారందరిని ఆగస్టు నెలాఖరులోగా పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్‌ను ఆదేశించారు. అలాగే నాడు – నేడు పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ రామయ్యను ఆదేశించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.



కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా నియమితులైన ఎస్వీ విజయ మనోహరి, భర్త మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు

హుండీ ఆదాయం రూ. 27 లక్షలు



గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామదేవత శ్రీ సుంకులా పరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపును ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలుకు చెందిన లలిత సుందరేశ్వరి సంఘం, శంకరవాణి సేవా సమితికి చెందిన 67 మంది మహిళలు స్వచ్ఛందంగా లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయంలోని నాలుగు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.27,16,842 ఆదాయం వచ్చిందని, ఈ సొమ్మును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఈఓ రాధాకృష్ణ తెలిపారు. తనిఖీ అధికారి హనుమంతరావు, ఎస్ఐ సోమ్లానాయక్ పాల్గొన్నారు.

23న సింహద్వార ప్రారంభోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు: కోడుమూరులోని పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఈనెల 23వ తేదీన సింహద్వారాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సింహద్వార ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు సుమన్, దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

బూత్ లెవల్ ఆఫీసర్ల నియామకం

కర్నూలు (టౌన్): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లను నియమించారు. గురువారం ఈ మేరకు ఎలక్ట్రోరోల్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 258 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి సచివాలయాల్లో పనిచేసే 258 మంది వార్డు వెల్ఫేర్, రెవెన్యూ, అడ్మిన్లలను నియమించారు. వీరంతా ఇంటింటి సర్వే చేసి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉంటుంది.

ఐదు ఇళ్లలో చోరీ

గడివేముల: మంచాలకట్ట గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామస్తులు బిడుగు నారాయణ, దాసు, రత్నమ్మ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. ఇళ్లలో ఎవరూ లేని విషయం గుర్తించిన దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి.. నారాయణ ఇంట్లో రూ.30 వేల నగదు, మూడు తులాల బంగారం, దాసు ఇంట్లో రూ.2 లక్షలతో పాటు 3 తులాల బంగారం, రత్నమ్మ ఇంట్లో తులం బంగారం చోరీ చేశారు. అలాగే రామదాసు, జంబులయ్య ఇళ్లలో వస్తువులను దోచుకున్నారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు గడివేముల ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. నంద్యాల క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. చోరీ జరిగిన ఇంటి వద్ద కత్తులు లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది.